# వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనం చూడండి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- కలెక్టర్, గ్రేటర్ కమిషనర్ కు ఆదేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ కు మంజూరైన వెల్ నెస్ సెంటర్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు వరంగల్ కలెక్టర్, గ్రేటర్ కమిషనర్ లను ఆమె ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనాన్ని వెంటనే పరిశీలించాలన్నారు. వరంగల్ కు వెల్ నెస్ సెంటర్ మంజూరుకు గతంలో కేంద్ర మంత్రులను కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు కడియం కావ్య వెల్లడించారు. ఇతర రాష్ట్రాల ఎంపీలతో కలిసి వినతి పత్రం అందజేసి, సంతకాలను సేకరించి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి ఇది అత్యంత అవసరం అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది సౌలభ్యం కోసం వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కావడం చాలా సంతోషకరం అన్నారు. ఇకపై వైద్య సేవల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ఎంపీ కృషి ఫలితంగానే వెల్ నెస్ సెంటర్ కు సిబ్బంది కేటాయింపు అలాగే వెల్ నెస్ సెంటర్లలను ఎక్కడ ఏర్పాటు చేయాలో ప్రతిపాదనలను ముందుకు తీసుకు వెళ్లడానికి అవకాశం లభించింది.

# దుర్గా మాతగా భద్రకాళి

- తొమ్మిదో రోజుకు చేరిన నవరాత్రోత్సవాలు
- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవిశరన్నవరాత్రులు మంగళవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారిని దుర్గగా అలంకరించి పూజారాధనలు జరిపించారు. భద్రకాళీ జన్మోత్సవం సందర్భంగా కృష్ణాష్టమి వలెనే ఈ రోజు రాత్రి కూడా అమ్మవారికి విశేష అభిషేక అర్చనాదులు, జపహోమలు జరుపనున్నారు. భద్రకాళీ విశ్వమంతా వ్యాపించి ఉన్నప్పటికీ కాకతీయుల రాజధాని ఏకశిలా నగరంగా ప్రసిద్ధి చెందిన తెలంగాణలోనే వరంగల్ మహానగరంలో దుర్గాష్టమినాడు కోటి యోగినీ గణములతో అవతరించడం వల్ల ఈ వరంగల్ మహానగరం ఒక పవిత్రతను సంతరించుకుంది. అందుకే ఈ రోజు స్త్రీలందరూ అమ్మవారికి చద్దులు చేసి నివేదిస్తారు. ఇదే చద్దుల బతుకమ్మ పండుగ అయింది. బతుకమ్మ భద్రమ్మ ఇద్దరూ ఒక్కటే. ఈ రోజు వేలాది మంది స్త్రీలు దేవాలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడారు. అమ్మవారి ఉదయం విమానక సేవ, సాయంకాలం సర్వభూపాల సేవలు జరిపించారు. అమ్మవారిని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ కెవెన్ సంధ్యారాణి తదితరులు దర్శించుకున్నారు.

## ఎస్ఆర్ఆర్ తోటలో..


వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతం సిరంగి రాజారాం తోటలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం తొమ్మిదో రోజు అమ్మవారు శ్రీ విజయ దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి ఘనంగా పూజలు నిర్వహించారు.

# దుర్గామాతగా ఎల్లమ్మ తల్లి..





**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో నవరాత్రి సందర్భంగా అమ్మవారు తొమ్మిదో రూపం అయిన దుర్గామాత అలంకరణలో దర్శనమిచ్చారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, దుర్గుతులు పోగొట్టాలని భక్తులు వేడుకున్నారు. అనంతరం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఎరుపు రంగు చీరతో ఎరుపు రంగు పూలతో దేదిప్యమానంగా అలంకరించి నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మారుపాక శ్యాం ప్రసాద్, దూడల శోభారాణి, లగిశెట్టి పద్మావతి, కన్న జ్యోతి, గట్టు విజయ, వీణ, తూముకుంట్ల విజయ, మినీలాపురం శోభా, కొలనుపాక సునీత, మాదారపు కల్పన, లలిత, జ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ స్ఫూర్తి.. విజయదశమి

తెలుగు క్యాలెండర్ ప్రకారం 2025 అక్టోబర్ 2 (విశ్వావసు నామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ దశమి) ఈసారి అత్యంత విశిష్టమైన రోజుగా నిలవనుంది. ఈ పవిత్ర దినాన యావత్ భారతం విజయదశమి (దసరా) పండుగను జరుపుకోవడమే కాకుండా, అదే రోజున జాతిపిత మహాత్మా గాంధీ, రాజనీతిని నేర్పించిన లాల్ బహదూర్ శాస్త్రి ఉత్సవాలు రావడం అపూర్వ సమన్వయంగా చెప్పవచ్చు. భారతీయ సంప్రదాయం, జాతీయ ఆత్మ, రాజ్యాంగ విలువలు ఒకే వేదికపై నిలిచే ఈ రోజుకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

## ఆధ్యాత్మికత సమ్మేళనం..

దసరా కేవలం పండుగ మాత్రమే కాదు.. అది ధర్మానికి విజయ శిఖరం. శ్రీరాముడు రావణుడిపై సాధించిన గెలుపు ధర్మసత్యాలకు నిలబడాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తే, దుర్గాదేవి మహిషాసురుడిపై సాధించిన విజయం స్త్రీ శక్తికి, దివ్య శక్తికి ప్రతీకగా నిలుస్తోంది. అందుకే ఈ పండుగను విజయదశమి అంటారు. ఈ రోజున ప్రారంభించే శుభకార్యాలు విజయవంతమవుతాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం. విజయదశమి రోజున నిర్వహించే ఆయుధపూజ, వాహనపూజ, విద్యారంభం ముఖ్యమైనవి. విద్యార్థులు కొత్త పుస్తకాలతో చదువును ఆరంభిస్తారు. శిల్పకారులు, రైతులు, వడ్రంగులు వంటి వృత్తినిపుణులు తమ పనిముట్లను పూజించి, వాటికి కృతజ్ఞతలు తెలుపుతారు. వాహనదారులు తమ వాహనాలకు పూజలు చేసి, రక్షణను కోరుకుంటారు. పోలీసులు, సిపాయులు, ఇతర రక్షణ విభాగంలో పని చేసేవారంతా ఆయుధ పూజ చేస్తారు. ఈ ఆచారాలు మన జీవితంలో శ్రమకు గౌరవాన్ని, కృతజ్ఞతా భావాన్ని పెంపొందిస్తాయి.

## పాలపిట్ట ప్రత్యేకత..

దసరా పండుగతో జమ్మి చెట్టు, పాలపట్టకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. జమ్మి ఆకులను బంగారంగా భావించి పంచుకోవడం శుభప్రదంగా భావిస్తారు. జమ్మి చెట్టును దర్శించినప్పుడు పఠించే మంత్రం మనసులో ధైర్యాన్ని, విజయ నమ్మకాన్ని నింపుతుంది. అదేవిధంగా, పాలపిట్టను దర్శించడం కూడా మంగళకరంగా భావిస్తారు. ఇది విజయాన్ని, శుభప్రదమైన భవిష్యత్తును సూచిస్తుంది.

## గాంధీ జయంతి రోజే..

ఈసారి దసరా పండుగ అక్టోబర్ 2న రావడంతో దానికి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. గాంధీజీ మనకు అహింస, సత్యం, సత్యాగ్రహం అనే విలువలను బోధిస్తారు. లాల్ బహదూర్ శాస్త్రి రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవలసిన ప్రాముఖ్యతను గుర్తుచేస్తారు. ఈ రెండు జాతీయ స్ఫూర్తులు దసరా ఆధ్యాత్మికతతో కలవడం ఈ రోజును ఒక మహత్తర దినోత్సవంగా మారుస్తుంది. అక్టోబర్ 2ను కేవలం పండుగగా కాకుండా, సంకల్ప దినంగా జరుపుకోవాల్సిన అవసరం ఉంది.

## విజయదశమి సందేశం..

దసరా మనలోని కోపం, అహంకారం, స్వార్థం వంటి అంతర్గత శత్రువులను జయించమని పాఠం చెబుతుంది. ఈ పండుగ పిల్లలకు ధర్మం, సత్యం, విలువలు నేర్పేది. సమాజంలో సహనం, సహకారం, సమానత్వం బలపడేలా, దేశం అభివృద్ధి చెందాలంటే మనం మానసికంగా కూడా అభివృద్ధి చెందాలని గుర్తుచేసే పవిత్ర దినం. ఈ విజయదశమిని ఆచారాల పండుగగా మాత్రమే కాకుండా, సత్యం – ధర్మం – ఐక్యత – మానవతా విలువల సమ్మేళనంగా జరుపుకుందాం.



- నాగరాజు ముదిరి
ఎంఎస్సీ, ఎంఏ, ఎంఈడీ
సెల్ నెంబర్ : 9676512489

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com